

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
గురువారం 16 మే 2024





సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలకు ఇంకా 20 రోజుల గడువు ఉంది. పోలింగ్ పూర్తయి నేటితో మూడురోజులైంది. పోలింగ్ ఎంత శాతం నమోదైంది అనే వివరాలు బుధవారం నాటికి పోలింగ్ బూత్‌ల వారీగా అందుబాటులోకి వచ్చాయి. దీంతో అటు కూటమి ఇటు వైసీపీ, కాంగ్రెస్ నేతలు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. ఈ ఎన్నికల్లో ఓట్లు వెల్లువెత్తాయి. గత రెండు పర్యాయాలకు మించి ఈ దఫా ఓట్లు పోలయ్యాయి. దీంతో ఇవి ఎవరికి లాభం అనే కోణంలో ఎన్డీయే కూటమి నేతలు లెక్కలు వేసుకుంటూ ఉండగా.. వైసీపీ నేతలు సైలెంట్‌గా ఉన్నారు.



సోమవారం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కమలాపురంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

ఓట్ల వెల్లువ.. ఎవరికి లాభం..?

- యువత ఓట్లు ఎటు వైపు
- లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు
- తమదే విజయమంటున్న కూటమి నేతలు
- సైలెంట్‌గా వైసీపీ

కడప పార్లమెంట్ పరిధిలో.. 2014లో పోలైన ఓట్లు

నియోజకవర్గం	మొత్తంఓట్లు	పోలైనవి	శాతం
బద్వేలు	2,12,886	1,54,829	73.17
కడప	2,70,045	1,59,457	60.10
పులివెందుల	2,25,014	1,79,650	80.64
కమలాపురం	1,86,981	1,53,713	84.41
జమ్మలమడుగు	2,27,461	1,94,850	86.36
ప్రొద్దుటూరు	2,32,181	1,80,972	78.66
మైదుకూరు	1,94,963	1,63,760	86.47
మొత్తం	15,49,531	11,87,231	78.54

2019లో...

నియోజకవర్గం	మొత్తంఓట్లు	పోలైనవి	శాతం
బద్వేలు	2,04,618	1,58,863	77.64
కడప	2,65,154	1,64,772	62.14
పులివెందుల	2,23,411	1,80,663	80.87
కమలాపురం	1,92,941	1,59,335	82.58
జమ్మలమడుగు	2,37,577	2,02,890	85.40
ప్రొద్దుటూరు	2,36,770	1,82,125	76.93
మైదుకూరు	2,07,957	1,71,777	82.60
మొత్తం	15,68,463	12,20,425	78.30

2024లో...

నియోజకవర్గం	మొత్తంఓట్లు	పోలైనవి	శాతం
బద్వేలు	2,19,290	1,72,660	78.74
కడప	2,83,543	1,85,079	65.27
పులివెందుల	2,29,687	1,86,834	81.34
కమలాపురం	2,04,169	1,72,401	84.44
జమ్మలమడుగు	2,42,556	2,10,241	85.68
ప్రొద్దుటూరు	2,47,966	1,97,149	79.59
మైదుకూరు	2,11,855	1,79,692	84.82
మొత్తం	16,39,066	13,04,256	79.57

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై ఉమ్మడి రాష్ట్రాల ప్రజలు దృష్టి సారించారు. కడప పార్లమెంటు ఫలితంపై సర్వత్రా ఆసక్తి కనబరుస్తున్నారు. టీడీపీ నుంచి భూపేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి జగన్ సోదరి వైఎస్ షర్మిల, వైసీపీ నుంచి జగన్‌కు వరుసకు సోదరుడు అవినాశ్‌రెడ్డి పోటీ చేయడంతో ఈ ఎన్నికలు ప్రత్యేకంగా మారాయి. ఇక ఓటు వేసేందుకు వెల్లువలా ఓటర్లు వచ్చారు. ఈ పోలింగ్ ఎవరికి మేలంటూ లెక్కలు వేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 79.57 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా ఓటర్లలో సగం మందికి పైగా మహిళలు ఉన్నారు. జిల్లా మొత్తం ఓటర్లు 16,39,066 మంది ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 8,37,997, కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారు 18 సంవత్సరాలు దాటిన వారు 45,196 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారు. కొత్త ఓటర్లు ఎవరికి ఓటు వేశారని పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. అయితే ప్రభుత్వ వ్యతిరేకత కారణంగానే పోలింగ్ శాతం పెరిగిందని నిరుద్యోగ యువత, ఉద్యోగులు అంతా కూటమి వైపు ఉన్నారంటూ కూటమి ధీమాలో ఉంది. మాదే గెలుపంటూ ప్రెస్‌మీట్లు పెట్టి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక వైసీపీ నేతలు మాత్రం సైలెంట్ అయిపోయారు. మొన్నటి వరకు సంక్షేమ పథకాలు గెలిపిస్తాయని భావించారు. అయితే పోలింగ్‌కు పెద్ద ఎత్తున జనం రావడం, రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ సరళిని చూసిన తరువాత వైసీపీ నేతలు సైలెంట్‌గా ఉన్నారు. వైసీపీ కేడరుతో బూత్‌ల వారీగా సమాచారాన్ని తెప్పించుకోవడంలో నిమగ్నమయ్యారు. సొంత పార్టీ కేడరుతో పాటు వివిధ సర్వే సంస్థలతో ఫీడ్ బ్యాక్ తెలుసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 16,39,066 మంది ఓటర్లు ఉండగా.. 13,04,256 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 79.57 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి పెరిగింది. జమ్మలమడుగులో అత్యధికంగా 86.68 శాతం నమోదైంది. అత్యల్పంగా కడపలో 65.27 శాతం నమోదైంది.

ఎవరు ఓటు వైపు మొగ్గారో

ఎన్నికల్లో మహిళలు, తొలిసారి ఓటు వేసిన యువత ఎటు వైపు మొగ్గారన్న దానిపై ఆసక్తి నెలకొంది. కొత్త ఓటర్లు కూటమికేనని కూటమి నేతలు ధీమాగా ఉన్నారు. కొత్త ఓటర్ల పట్ల వైసీపీ నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనతో వీరంతా తమకే ఓటు వేసి ఉంటారని భావిస్తున్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో కొత్త ఓటర్లు తమ భవిష్యత్తుకోసం కూటమికే ఓటు వేశారని ఎన్డీయే భావిస్తోంది. షర్మిల పోటీ చేయడంతో మహిళలు పెద్దఎత్తున ఆమెకు వేశారని ఇది వైసీపీకి పెద్ద దెబ్బ అని చర్చ సాగుతోంది. అయితే ఆమె ఎన్ని ఓట్లు చీల్చి ఉంటారు, ఎక్కడ వైసీపీకి గండి పడిందన్న దానిపై సమాచారాన్ని రకరకాల మార్గాల్లో సేకరించుకుంటున్నారు. షర్మిలకు ఎంత ఓటింగ్ వచ్చిందన్నదానిపై ఆరా తీస్తున్నారు.

పోలింగ్‌శాతం పరిశీలిస్తే..

2014లో కడప పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 15,49,531 మంది ఓటర్లు ఉండగా 11,87,231 ఓట్లు పోలయ్యాయి. అంటే 78.54 శాతం మంది ఓటేశారు. 2019లో 15,68,463 మంది ఓటర్లకు గాను 12,20,425 మంది ఓటేయడంతో 78.30 శాతం పోలింగ్ నమోదైంది. ఇక తాజాగా జరిగిన ఓటింగ్‌లో మొత్తం ఓటర్లు 16,39,066 మంది ఉండగా వీరిలో 13,04,256 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 79.57 శాతం నమోదైంది. 2104, 2019 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది.



పులివెందుల వైసీపీలో కలవరం

- ఓడితే సరే.. అత్తెసరు మెజార్టీతో గెలిస్తే ఏంటి?
- అవినాశ్ శిబిరంలో అంతర్మథనం
- పులివెందులలో షర్మిలకు క్రాస్‌ఓటింగ్
- ఏ ఊరిలో... ఏ పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు
- ఫలితాల రోజు బట్టబయలు

వైసీపీ శిబిరంలో కలవరం మొదలైంది. పులివెందులలో నిన్న జరిగిన ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ వైసీపీని ఊపిరి ఆడనివ్వడం లేదు. ఏ స్థాయిలో క్రాస్ ఓటింగ్ జరిగిందో లెక్కలు వేసేందుకు కూడా అవినాశ్ శిబిరం కలవరపడుతోంది. షర్మిల కాంగ్రెస్ పార్టీలో గెలిస్తే సమస్య లేదు. అవినాశ్ అత్తెసరు ఓట్లతో గెలిస్తే మాత్రం అధినాయకుని ఏమి చెప్పాలి అనే అంతర్మథనంలో వైసీపీ పడింది. కౌంటింగ్ రోజు ఏ పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు వస్తాయో వాటికి ఏమి సమాధానం చెప్పాలో అని కలవరపడుతోంది. వివరాలిలా..

కడప, మే 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల వైసీపీ అడ్డా. వైఎస్ ఉన్నన్ని రోజులు కాంగ్రెస్ పార్టీకి అలాగే ఉండేది. అనంతరం వైసీపీ వెంట ఉంది. 2011నుంచి అటు వైసీపీ, ఇటు టీడీపీ మాత్రమే ప్రధానంగా పోటీపడుతూ ఉండేవి. ఈ ఎన్నికలు మరో కోణాన్ని చూపించాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున వైఎస్ కుమార్తె, సీఎం జగన్ మోహన్‌రెడ్డి చెల్లెలు వైఎస్ షర్మిల బరిలో నిలిచారు. పులివెందులలో వైసీపీకి ఉన్న క్యాడర్ గాని, ఓటు బలం గాని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. వైఎస్ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తన రాజకీయ భవిష్యత్తును ఒక్కొక్క మెట్టును పేర్చుకుంటూ కంచుకోటలా పులివెందులను తయారు చేసుకున్నారు. ఇపుడు అదే కుటుంబంలో షర్మిల బరిలోకి దిగడంతో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసిన షర్మిలకు క్యాడర్ కూడా సరిగా లేదు. కానీ వైఎస్ కుమార్తె అనే ఏకైక అస్త్రమే ఆమెకు కొండంత అండగా నిలిచింది. దీనికి తోడు ఈ ఎన్నికల్లో వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-8గా ఉన్న అవినాశ్‌రెడ్డిపై పోటీ చేయడం, అదే ఎన్నికల ఆయుధంగా ప్రచారంలోకి తీసుకెళ్లడంలో షర్మిల సఫలీకృతులయ్యారు. ఆమెకు తోడుగా వివేకా కుమార్తె డాక్టర్ సునీత కలసి వివేకానందరెడ్డికి న్యాయం చేయాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగారు. దీనితో పులివెందుల నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగిందనే చెప్పాలి. మన ఆడబిడ్డకు మనం న్యాయం చేయకపోతే ఎలా అనే సమాధానంగా ఓట్లు పడ్డాయని అంటున్నారు. మరోపక్క ఎప్పుడూ లేని విధంగా టీడీపీ ప్రతి పోలింగ్ కేంద్రంలో కూడా ఏజెంట్లను ఏర్పాటుచేసింది. ఎక్కడ ఎలాంటి సైక్లింగ్ కాని, రిగ్గింగ్ కాని లేకుండా గట్టి ప్రయత్నం చేసింది. దీంతో షర్మిలకు బాగా కలిసి వచ్చిందనే చెప్పాలి.

పులివెందులలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగిందని అక్కడి వైసీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. అటు టీడీపీలోను, వైసీపీలోను ఎంపీ ఓటు మాత్రం షర్మిలకే పడినట్లు గంటాపథంగా చెబుతున్నారు. దీనితో వైసీపీ శిబిరంలో సోమవారం రాత్రి నుంచే కలవరం మొదలైంది. షర్మిల గెలిస్తే ఏ సమస్య లేదని వైసీపీ నాయకులే అంటున్నారు. రాజశేఖర్‌రెడ్డి కుమార్తె, అందులోను వివేకానందరెడ్డికి న్యాయం చేయాలని కొంగుచాచి అడిగింది కాబట్టి ఓటర్లు షర్మిల వైపు మొగ్గు చూపుతారని ఒక సాకు దొరుకుతుందని కిందిస్థాయి వైసీపీ నాయకులు అంటున్నారు. లేదటే 5 లేదా 10వేల మెజార్టీతో అవినాశ్‌రెడ్డి గెలుపొందితే పెద్ద సమస్య వచ్చిపడుతుందని వైసీపీ నాయకులు కలవరపడుతున్నారు. అందుకు కారణం కూడా లేకపోలేదు. ఆయన చుట్టూ ఉన్న నాయకులు వారివారి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతాన్ని పరిశీలిస్తే తమకు ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వంతోను, అవినాశ్‌రెడ్డితోను ఇన్ని పనులు చేయించుకొని కనీసం మీ పోలింగ్ కేంద్రంలో ఓట్లు సరిగా వేయించలేక పోయారా అని అధినాయకత్వం తాము ముఖం ఎక్కడ పెట్టుకోవాలని ఒకరితో ఒకరు చర్చించుకుటున్నట్లు తెలిసింది. మళ్లీ ప్రభుత్వం వస్తే మనమాట చెల్లుబాటు అవుతుందా అని కూడా మధనపడుతున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా వైసీపీ ఓటు షర్మిలకు బదిలీ కావడం ఆ పార్టీని కలవరపెడుతోందనడం నగ్నసత్యం.

బోనాలతో పోటెత్తిన మహిళలు



ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో పెద్దమ్మ, చిన్నమ్మ దేవర మహోత్సవానికి మహిళా భక్తులు పోటెత్తారు. బుధవారం ఉదయం గ్రామం నలుమూల నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో మట్టికుండల్లో పెరుగన్నంతో కూడిన బోనాల(చల్ల)ను తీసుకుని వందలాది మంది వీధుల్లోనుంచి వాయిద్యాలు, తప్పెట్లతో, దరువులతో ఆలయం వద్దకు చేరుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

\- యర్రగుంట్ల



బోనాలతో గుడి వద్దకు వెళుతున్న మహిళలు

'వజ్ర'తో పర్యవేక్షణ

- పలు చోట్ల పోలీసు పికెటింగ్
- కొనసాగుతున్న 144 సెక్షన్ అమలు

జమ్మలమడుగు, మే 15: జమ్మలమడుగు పట్టణం, గ్రామాల్లో ఎక్కడా ఎలాంటి అల్లర్లు జరుగకుండా డీఎస్పీ యశ్వంత్ పర్యవేక్షణలో ముందస్తుగా పోలీసులు అప్రమత్తమయ్యారు. 13న సార్వత్రిక ఎన్నికల రోజు గొడవలు జరగడంతో గట్టి చర్యలు తీసుకున్నారు. బుధవారం పట్టణంలోని ఆయా పార్టీల కార్యాలయాల వద్ద చోటా నేతల ఇండ్ల వద్ద, గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోంది. పట్టణంలోకి బుధవారం ఉదయం ప్రత్యేక బలగాలు చేరుకున్నాయని, ఆ దిశగా పాత బస్టాండు, మున్సిపల్ పారిశుధ్య మస్టర్ పాయింట్ ఎదురుగా వజ్ర వాహనాన్ని పోలీసులు సిద్ధం చేశారు. పట్టణంలోని అన్ని వీధుల్లో పోలీసు బలగాలు తిరిగాయి. డీఎస్పీ కార్యాలయంలో అధికారులు సమావేశమైనట్లు తెలుస్తోంది. ఎక్కడ అల్లరి జరిగినా పది నిముషాల్లో పు పోలీసు బలగాలు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ ప్రకటించారు. రాజకీయ నేతలు, పోటీలో ఉన్న అభ్యర్థులు జమ్మలమడుగు పట్టణానికి వారి వారి కార్యాలయాల వద్దకు రాకుండా ఇంటి వద్దే ఉండేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో జమ్మలమడుగు పట్టణంలో అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతానికి ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు.



జమ్మలమడుగు పాత బస్టాండులో సిద్ధంగా పెట్టిన వజ్ర వాహనం

వైసీపీ నేతల బరితెగింపు

- చెరువుకట్ట తవ్వి భూ ఆక్రమణ యత్నం
- అడ్డుకున్న రైతులు

అట్లూరు, మే 15: ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉండటంతో వైసీపీ నేతలు ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అట్లూరు మండలం కొండూరు మర్రిమానుకుంట చెరువుకట్టను ఎక్స్‌కవేటర్లతో తొలగించి అలుగు పోరంబోకు, చెరువుతట్టు పోరంబోకు భూమిని బుధవారం వైసీపీ నేతలు చదును చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు రాతి స్తంభాలు నాటి కంచె వేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో స్థానిక ఆయకట్టు రైతులు బత్తల వెంకటసుబ్బయ్య, ఓబులపతి గోపయ్య, చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు పెద్దపల్లె లక్ష్మయ్య, మరి కొందరు రైతులు అడ్డుకున్నారు. అయితే ఆక్రమణదారులు తమకు పట్టాలున్నాయంటూ దురుసుగా మాట్లాడారు. గ్రామరెవెన్యూ సహాయకుడు శ్రీను వెంటనే అట్లూరు డిప్యూటీ తహశీల్దారు రవిశంకర్‌కు ఫోను చేసి భూ ఆక్రమణపై వివరించారు. తహశీల్దారు భూ ఆక్రమణదారులతో మాట్లాడుతూ మీవద్ద ఉన్న ఆధారాలతో గురువారం తహశీల్దారు కార్యాలయానికి రావాలన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు.



మర్రిమానుకుంట చెరువుకట్టను కొంతమేర చదును చేసి రాతి స్తంభాలు నాటిన దృశ్యం

కంచె వేసేందుకు వైసీపీ నేతల యత్నం..



మర్రిమానుకుంట చెరువు నిర్మించి దాదాపు 60 ఏళ్లు కావస్తోంది. చెరువు కింద ఎస్సీ బడుగు బలహీన వర్గాల రైతులకు భూములు ఉన్నాయి. దాదాపు 150 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు నిండి అలుగు పారేందుకు వీలు లేకుండా చెరువు కట్ట ఆక్రమించి కంచె వేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించడం విడ్డూరంగా ఉంది. వీరిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- లక్ష్మయ్య, మర్రిమానుకుంట చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్

తరుముకొస్తున్న ఖరీఫ్

- జూన్ 15 నుంచి ప్రారంభం
- వ్యవధి నెల మాత్రమే
- కార్యాచరణ అమలుపై అధికారుల కసరత్తు
- విత్తనాల పంపిణీకి హడావిడి
- 70 వేల హెక్టార్లలో పంట సాగు
- 12,252 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు
- 73,582 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- వేసవి దుక్కులపై శ్రద్ధపెట్టిన అన్నదాతలు

కడప(రూరల్), మే 15: సాధారణ ఎన్నికలతో నెలరోజులుగా అధికార యంత్రాంగం, ఆయా పార్టీల అభ్యర్థులు, రాజకీయ నాయకులు, అన్ని వర్గాల ప్రజలతో పాటు రైతన్నలు కూడా బిజీబిజీగా గడిపారు. పోలింగ్ పూర్తికావడంతో వ్యవసాయశాఖ అధికారులు తరుముకొస్తున్న ఖరీఫ్ సీజన్‌పై దృష్టిసారించారు. ఖరీఫ్ సీజన్ జూన్ 15 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు 30 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. పైగా వాతావరణ శాఖ ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఖరీఫ్ సీజన్‌లో అనుకున్న సమయానికే విత్తనం పడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇందుకు అనుగుణంగా ఖరీఫ్ కార్యాచరణ అమలుపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. విత్తనాల పంపిణీకి చర్యలు చేపట్టారు. ఆయా పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం అన్నదాతలు ఏటా రోడ్డెక్కడం పరిపాటిగా ఉంది. ఈ ఏడాది జిల్లాలో అటువంటి సమస్య తలెత్తకుండా ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ యేడాది మొత్తం సాగు విస్తీర్ణం ఎంత....? భూసారాన్ని బట్టి ఏయే పంటలను ఏ మేరకు చేపట్టాలి...? ఎరువులు, విత్తనాలు ఎంత మేరకు అవసరం అవుతాయి...? వరి పంట సాగుకు పచ్చిరొట్ట ఎరువులు ఎంత అవసరం...? వీటి పంపిణీకి చర్యలు ఎలా...? అన్న వివరాలతో పాటు రైతులకు తగిన వ్యవసాయ పరిజ్ఞానం, సహకారం అందించేందుకు వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

70 వేల హెక్టార్లలో పంట సాగు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలు కలుపుకుని 70వేల హెక్టార్లు సాగు లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. ఇందులో ప్రధానంగా వరి పంట సాగుకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులను సిద్ధం చేసి పంపిణీకి చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు విత్తనాలను 20వ తేదీ లోగా రైతులకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే గడువులోగా విత్తనాలు అన్నదాతలకు దొరుకుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

12,252 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనగ, మినుము, పెసర, కందులు, రాగి, కొర్ర పంటతో పాటు వివిధ పంటలకు గాను 12,252 క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయి. ఇందులో పచ్చిరొట్ట అయిన జీలుగలు478 క్వింటాళ్లు, పిల్లపెసర 80 క్వింటాళ్లు, వెరుశనగ 5,849 క్వింటాళ్లు ఉన్నాయి. ఖరీఫ్ సాగుకు అవసరమైన వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీ ద్వారా రైతులకు ఆర్బీకేలలో డి.క్రిష్ యాప్ ద్వారా పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆర్‌బీకే సిబ్బంది విత్తన పంపిణీపై విస్తృత ప్రాచారాన్ని చేపట్టి డి.క్రిష్ యాప్‌లో రైతులు తమకు కావలసిన విత్తనాల గురించి నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాల్సి ఉంది.

73,582 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

2024-25 ఖరీఫ్ పంటల సాగుకు 73,582 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంగా గుర్తించారు. ఇందులో యూరియా 21,208 మెట్రిక్ టన్నులు, డీఏపీ 9,226 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 2,791 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 36,362 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి ఎరువులు 3,997 మెట్రిక్ టన్నులు అవసరంగా అధికారులు భావించారు.

ప్రారంభమైన ఖరీఫ్ పనులు

ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధ చేసేందుకు అవసరమైన వేసవి దుక్కులకు మే నెల మొదటి వారంలోనే సంవృద్ధిగా వర్షాలు పడడంతో పనులు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని చాలా మండలాల్లో పదును వర్షాలు పడడంతో రైతులు పొలాలను దుక్కులు చేస్తున్నారు. దుక్కులను పూర్తి చేసిన రైతులు తమ ఇళ్లవద్ద నిల్వ ఉంచిన సేంద్రియ ఎరువులను తీసుకెళ్లి పొలాల్లో చల్లుతున్నారు.

గత ఏడాది ఖరీఫ్ రైతులను తీవ్ర నిరాశ పరిచింది. ఈ ఏడాదైనా తమను గట్టెక్కించాలని రైతులు కోరుకుంటున్నారు.



ఖరీఫ్ కార్యాచరణ అమలుకు చర్యలు

2024-25 ఖరీఫ్ కార్యాచరణ అమలుకు చర్యలు చేపట్టాం. 70 వేల హెక్టార్లలో వివిధ పంటల సాగు లక్ష్యంగా ఎంచుకున్నాం. ఇందుకు 12,252 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు అయ్యాయి. వీటిని సబ్సిడీ ద్వారా రైతులకు ఆర్బీకేలలో డి.క్రిష్ యాప్ ద్వారా పంపిణీ చేస్తాం. ఈ మేరకు విత్తనాలను మండలాల వారీగా కేటాయిస్తున్నాం. ఆర్బీకే సిబ్బంది విత్తన పంపిణీపై విస్తృత ప్రాచారాన్ని చేపట్టి డి.క్రిష్ యాప్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తారు.



\- ఎ.నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి

భక్తిశ్రద్ధలతో బ్రహ్మంగారి ఆరాధన


గుడి ఉత్సవంలో వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మే 15 : కాలజ్ఞానకర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజా మహోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండోరోజు బుధవారం స్వామి వారికి ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 9 గంటలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం నుంచి పురవీధుల గుండా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ గుడి ఉత్సవాన్ని చేపట్టారు. ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలకు ఏర్పాట్లు చేశామని దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంటు కమిషనర్ సి.శంకరబాలాజీ తెలిపారు. భక్తులకు తాగునీరు, భోజనవసతి, విశ్రాంతి గదులతో పాటు ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లు ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేశామని భక్తులందరికీ మంచి నీటితో పాటు మజ్జిగ ప్యాకెట్లు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భోజన వసతి ఉంటుందన్నారు. గురుపూజ మహోత్సవాలకు విచ్చేసి స్వామి వారిని దర్శించుకోవాలని తెలిపారు.

జిల్లా ప్రతిష్టను పెంచిన కట్టా నరసింహులు


కట్టా నరసింహులుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప (నాగరాజుపేట), మే 15 : తెలుగు సాహిత్యం, జిల్లా చరిత్రలపై ఎంతో మమకారం గల విద్వాన్ కట్టా నరసింహులు కైఫీయత్తుల పరిష్కారం ద్వారా మరుగునపడిన గొప్ప చరిత్రను వెలికితీసి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేశారని వైవీయూ పాలక మండలి సభ్యుడు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బ్రౌన్ గ్రంథాలయ తొలి బాధ్యులు, కడప కైఫీయత్తుల పరిష్కర్త విద్వాన్ కట్టా నరసింహులు 3వ వర్ధంతిని పురస్కరించుకుని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత విద్వాన్ కట్టా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సాహిత్యం కంటే కట్టా చరిత్ర పరిశోధనపై కృషి చేశారని, కైఫీయత్తుల పరిష్కారంతో ఆయనకు తెలుగునాట విశేషమైన పేరు ప్రతిష్టలు లభించాయన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ విద్వాన్ కట్టా నరసింహులుకు జిల్లా రుణపడి ఉందని ఆయనకు ఎంతో ఇష్టమైన బ్రౌన్ గ్రంథాలయ ఆవరణంలో బ్రౌన్ శాస్త్రి సరసన ఆయన శిలావిగ్రహాన్ని ఏర్పాటు చేయడం సమంజసంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, చిత్రకారుడు వెంకటేశ్, మధు, డేవిడ్, గొబ్బూరి కొటేశ్వరరావు, జ్యోతిజార్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సామర్థ్యం ఆధారంగా విద్యాబోధన

పీఏఎల్ శిక్షణ కార్యక్రమంలో ఆర్‌జేడీ, డీఈవోల సూచనలు


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మే 15 : విద్యార్థి సామర్థ్యం ఆధారంగా విద్యాభ్యాసం జరగాలని పీఏఎల్ ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల ప్రాంతీయ సంచాలకులు జోన్-4 వై.రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.అనురాధలు సూచించారు. బుధవారం కడప నగరం జయనగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఏపీవో రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాలోని పీఏఎల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంగ్లీషు, గణిత ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ, డీఈవోలు మాట్లాడుతూ జాతీయస్థాయిలో నోబెల్ అవార్డు గ్రహీత రాబర్ట్ మైఖేల్ క్రేమర్ ఆధ్వర్యంలో రూపకల్పన చేసిన కాన్వి జీనియస్ కంటెంట్ డెవలప్‌మెంటు ప్రోగ్రాంద్వారా ప్రపంచంలో 120 దేశాలు అమలుపరుస్తున్న పీఏఎల్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని 564 పాఠశాలల్లో 2019 నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు వారి వైయక్తిక భేదాలకనుగుణంగా విద్యాభ్యాసం నిర్వహించి ప్రతి విద్యార్థికి ఆ తరగతికి గల సామర్థ్యాన్ని అందే విధంగా బోధన అభ్యసనం జరగాలని సూచించారు. అనంతరం కాన్వి జీనియస్ కంటెంట్ డెవలప్‌మెంటు డిప్యూటీ మేనేజర్లు సౌరబ్‌గౌర్, ఉజ్వల్, అనిరుధ్, కిషోర్‌బాబు, పీఏఎల్ కో-ఆర్డినేటర్లు, పీఏఎల్ ఆవశ్యకతపై ఉపాధ్యాయులు, విద్యార్థులు చేయాల్సిన విధివిధానాలు కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాల అధికారులు అశోక్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, జిల్లావిద్యాశాఖ, సమగ్ర శిక్ష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి వెల్లాల బ్రహ్మోత్సవాలు




రాజుపాలెం, మే 15: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ సంజీవరాయస్వామి, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను 19 నుంచి 27వ తేదీ సోమవారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బీవీ నరసయ్య, చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. 20న సోమవారం కల్యాణోత్సవం, 22న బుధవారం హనుమంతోత్సవం, 23న గురువారం గరుడోత్సవం, 25న శనివారం రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 26న పల్లకీసేవ, 27న వసంతోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు. 25న శనివారం రథోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి వృషభాలకు బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ.1.10 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలు ఉంటుందన్నారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టరు బుధవారం సంజీవరాయస్వామి దేవస్థానంలో చైర్మన్, కమిటీ సభ్యులు విడుదల చేశారు.

తలనీలాల వేలం పాట ద్వారా రూ. 13.8 లక్షల ఆదాయం

చెన్నకేశవ సంజీవరాయస్వామి భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం తలనీలాల వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బీవీ నరసయ్య, చైర్మన్ బుక్క సముద్రం జగదీశ్వర్‌రెడ్డి, పర్యవేక్షణాధికారి ఆర్.నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్చు పాటదారు మునిశంకర్ రూ.13.8 లక్షలకు ఈ తలనీలాల వేలం పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

3 టీఎంసీల దిగువన గండికోట నీటిమట్టం


గండికోటలో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం , మే 15: గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం 3 టీఎంసీల దిగువకు పడిపోయింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. బుధవారానికి గండికోట ప్రాజెక్టులో 23.9 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. 202.67 అడుగుల వద్ద ఈ నీటిమట్టం ఉన్నట్లు డీఈ తెలిపారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో గానీ, ఔట్‌ఫ్లో గానీ లేదన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మహబూబ్ షరీఫ్ మృతదేహం

కాశినాయన మే 15: కాశినాయన మండలం అంబవరం గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో కమాల్‌సాబ్‌గారి మహబూబ్‌షరీఫ్ (45) మృతి చెందినట్లు కాశినాయన ఎస్‌ఐ అమర్‌నాధ్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు నివసించే రేకులషెడ్ వర్షానికి కారకుండా పట్టకప్పేందుకు పైకిఎక్కాడు. రేకులకు విద్యుత్ సరఫరా కావడంతో కరెంట్ షాక్‌తో అక్కడి కక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఎనిమిదేళ్ల కూతురు కలదు. ఆమేరకు కేసు నమోదుచేసి శవాన్ని పోస్టుమార్టంకు పంపామన్నారు.

పేరులో 'పురం'.. సమస్యల నిలయం

- కమలాపురం మున్సిపాలిటీ అయినా...
- ఆమడ దూరంలో అభివృద్ధి
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- కాలనీల్లో సంచరిస్తున్న పందులు

పేరుగొప్ప ఊరు దిబ్బ అంటే ఇదేనేమో.. కమలాపురం.. పేరులో పురం ఉంది. ఊరు మాత్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పేరుకే ఇది మున్సిపాలిటీ.. ఇక్కడ సమస్యలకు కొదవే ఉండదు. మున్సిపాలిటీగా రూపాంతరం చెందినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది.





రోడ్డుపై అధ్వాన్నంగా ఉన్న చెత్తకుప్ప

కమలాపురం రూరల్, మే 15: కమలాపురం మూడు సంవత్సరాల కిందట మున్సిపాలిటీగా అవతరించింది. మున్సిపాలిటీ అయిన మూడు నాలుగు నెలలకే మొట్టమొదటి ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 20 వార్డులున్నాయి. ఇందులో వైసీపీ 15, టీడీపీ 5 వార్డులు కైవసం చేసుకున్నాయి. అధికార పీఠాన్ని వైసీపీ దక్కించుకుంది. పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఒక్క సమస్యా పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. తాగునీటికీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడు మారుమూల ప్రాంతాలకు పక్కా రహదారులు లేవు. వర్షాకాలంలో అయితే పలు కాలనీలు చెరువును తలపిస్తుంటాయి. ఇళ్లల్లోకి చేరి రోడ్ల మీద మురుగునీరు నెలల తరబడి నిల్వ ఉంటుంది. దీంతో దోమలు చేరి దుర్గంధం వ్యాపిస్తుంటుంది. పలువార్డుల్లో పందుల సంచారం కూడా ఎక్కువగా ఉంది. పలుమార్లు మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం అని జనం వాపోతున్నారు.


దట్టంగా పెరిగిన మొక్కలతో పూడిపోయిన మురుగునీటి కాలువ

తాగునీటికి అవస్థలు.. అస్తవ్యస్తంగా డ్రైనేజీ

కమలాపురం పట్టణంలో దాదాపు 25వేలకు పైగా జనాభా ఉంది. పట్టణంలో ప్రధానంగా మురుగునీటి సమస్య తాండవిస్తోంది. మురుగు ప్రవహించకుండా కాల్వలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో నీరంతా రోడ్లపై పారుతోంది. దీంతో 20వ వార్డులోని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మూడురోజులకు ఒకసారి నీళ్లు వదులుతున్నారు. కొన్ని వార్డుల్లో అసలే నీరు రాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో నీటి కష్టాలు మొదలయ్యాయి. మహిళలు వీధి కుళాయిల వద్ద బిందెలతో క్యూ కట్టాల్సిన పరిస్థితి వచ్చింది. కనీసం రోజు మార్చి రోజు అయినా నీటిని వదిలితే సమస్య ఉండదని అంటున్నారు.

మౌలిక వసతులు కరువు

కొన్ని చోట్ల వీధిదీపాలు వెలగడంలేదు. విష పురుగుల సంచారంతో దారిలో రాత్రిపూట నడవాలంటే ప్రజలు భయపడుతున్నారు. మున్సిపాలిటీగా మారినా.. కనీసం బస్సు షెల్టర్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఎండకు, వానకు బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి. వీటన్నింటికీ మించి పెద్ద సమస్య పట్టణంలో ఎక్కడా సామాజిక మరుగుదొడ్లు లేకపోవడం. బజార్లలో ఉన్నప్పుడు అత్యవసరం అయినా ఆపుకోవాల్సిందే. మరీ ముఖ్యంగా మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వీధిలైట్లు, మురుగునీటి వ్యవస్థ, సామాజిక మరుగుదొడ్లు అత్యవసరం అనేక ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు చాలా ఉన్నాయి. దారులు అధ్వాన్నంగా ఉన్నాయి. మున్సిపాలిటీ అర్హత కోసం గోపులాపురం పంచాయతీ పరధిలోని మీరాపురం గ్రామాన్ని విలీనం చేశారు. ఇంత వరకు ఆ గ్రామంలో కనీస సౌకర్యాలు కానీ, ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు.

ఉపాధి లేక అవస్థలు

అదే విధంగా కమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోని మెజార్టీ ప్రజల జీవనాధారం వ్యవసాయం. వ్యవసాయాధారిత పనులతో 60శాతం మంది ప్రజలు రోజువారి కూలీద్వారా జీవనం సాగిస్తుంటారు. వీరందరినీ ఉపాధి పనులు చాలా వరకు ఆదుకుంటాయి. ప్రస్తుతం ఉపాధి పనులు కూడా లేవని వాపోతున్నారు. తమకు ఉపాధి పనులు కల్పించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదు. కమలాపురం మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పే ప్రజాప్రతినిధులు ముందు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నింటినీ పరిష్కరిస్తాం..

పట్టణంలో తాగునీటి సమస్య ఎక్కడా లేదు. ఎక్కడైనా పైపులైను సమస్యలు వచ్చినప్పుడు ఒకటి రెండు రోజులు ఇబ్బందులు ఉంటాయి. వెంటనే వాటిని పరిష్కరిస్తున్నాం. రూ.93 కోట్లతో డ్రైనేజీ, రోడ్లు తదితర వాటికి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. మంజూరు అవగానే పనులు చేపడతాం. అలాగే సామాజిక మరుగుదొడ్ల కోసం మూడుప్రాంతాల్లో స్థలాన్ని కేటాయించాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే నిర్మాణాలు చేపడతాం. బస్ షెల్టర్ల కోసం ఆర్టీసీ శాఖకు నివేదించాం. అవి పరిశీలనలో ఉన్నాయి. త్వరలోనే వాటిని కూడా నిర్మిస్తాం.

- రాముడు, కమిషనర్, కమలాపురం మున్సిపాలిటీ


అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాల్వ

సివిల్ సప్లై గోడౌన్ వద్ద లారీ ఓనర్ల నిరసన

- *లోడింగ్ అన్ లోడింగ్ చార్జీలు చెల్లించాలి*
- *ఎంపీ అవినాశ్‌రెడ్డి మనుషులమని బెదిరిస్తున్నారు*
- *కాంట్రాక్టర్లు, అధికారులు మిలాఖతయ్యారు*


సివిల్ సప్లై గోడౌన్ వద్ద ఆందోళన చేస్తున్న లారీ ఓనర్లు

కడప(రూరల్) ఏప్రిల్ 15 : కడప మార్కెట్ యార్డు ఆవరణలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో లారీ ఓనర్లు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆందోళన చేశారు. బియ్యం బస్తాలతో వెళ్తున్న కాంట్రాక్టర్ల లారీలను స్టాక్‌పాయింట్లకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో లోడింగ్‌తో ఉన్న లారీలు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, సివిల్ సప్లై లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు చంద్రారెడ్డి, చిన్నవీరయ్య, సద్దాం, ఖాజా, సుభాన్ తదితరులు మాట్లాడుతూ.. సివిల్ సప్లై బియ్యం రవాణా బాడుగలలో కాంట్రాక్టర్లు, అధికారులు మిలాఖతై బాడుగలను తక్కువగా ఇస్తూ తమ కడుపులు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం నుంచి మండల ఎంఎల్ఎస్ పాయింట్లకు సివిల్ సప్లై (పౌరసరఫరాల) బియ్యం రవాణా కాంట్రాక్ట్‌ను తాత్కాలికంగా పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలను తుంగలో తొక్కి లారీ ఓనర్లకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. తాత్కాలికంగా వచ్చిన కాంట్రాకర్లు ఎంపీ అవినాశ్‌రెడ్డి మర్గీయులమని బాడుగలను తాము ఇచ్చినంత తీసుకొని వెళ్లాలని బెదిరిస్తున్నారన్నారు. ఈమేరకు సివిల్ సప్లై బియ్యాన్ని మండల కేంద్రాలకు రవాణాచేసే లారీలకు లోడింగ్ అన్‌లోడింగ్ విషయాలలో హమాలీ, టోల్గేట్ చార్జీలు చెల్లించకుండా ఒక్కొక్క లారీకి సుమారు రూ.1300లు తగ్గించి ఇస్తున్నారని అన్నారు. రవాణా చార్జీలు సైతం టన్నుకు పోరుమామిళ్లకు రూ.470లకు గాను రూ.420లు, మైదుకూరుకు రూ.320లకు గాను రూ.280లను, ప్రొద్దుటూరుకు రూ.350 గాను రూ.330లు, ఒంటిమిట్టకు రూ.310లకు గాను రూ.250 చెల్లిస్తున్నారన్నారు. తాము అవినాశ్‌రెడ్డి మనుషులమని, అధికారులకు సైతం మామూళ్లు ఇస్తున్నామని ఎవరికి చెప్పుకున్నా ఏమీ చేయలేరని అంటున్నారని వాపోయారు. ఈ మేరకు సివిల్ సప్లై డీఎంకు పలుమార్లు తమ సమస్యను విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు.

కాటన్ దొర జల, జనహితుడు

- *కాటన్ దొరకు నివాళులర్పించిన తులసిరెడ్డి*


కాటన్ దొరకు నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, మే 15: స్వర్గీయ సర్ ఆర్థర్ కాటన్ దొర జలహితుడు, జనహితుడు, అపర భగీరథుడు, నదుల అనుసంధానానికి ఆద్యుడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి కీర్తించారు. బుధవారం వేంపల్లెలో కాటన్ దొర 221 జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ కాటన్ దొర ఆంగ్లేయుడైనప్పటికీ సమాజ సేవ పరమావధిగా భావించి భారతీయుల, ప్రత్యేకించి ఆంధ్రుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. 1847-1852 మధ్యకాలంలో గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి క్షామపీడిత ప్రాంతమైన గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేశారన్నారు. కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్ట నిర్మాణం, కావేరి నదిపై ఆనకట్ట నిర్మాణం కాటన్ కృషి వల్లనే అన్నారు. 1863-1870 మధ్యకాలంలో కర్నూలు-కడప కాల్వను (కేసీ కెనాల్) నిర్మించి కర్నూలు, కడప జిల్లాలో కొంత ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించడమే కాక తుంగభద్ర-పెన్నా నదుల అనుసంధానంతో నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారన్నారు. కాటన్ మహాశయుడి స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాగునీటిరంగానికి ఎంతో ప్రాముఖ్యతనిచ్చాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టి.సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న పాల్గొన్నారు.

టీడీపీ ఏజెంట్లపై దాడి కేసులో 8 మంది అరెస్టు

మైదుకూరు/చాపాడు, మే 15: చాపాడు మండలం చిన్నగులవలూరు పోలింగ్ కేంద్రంలోని టీడీపీ ఏజెంట్లపై దాడి చేసిన కేసులో 8 మందిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ టి.వెంకటేశులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా చిన్నగులవలూరు 168 పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లుగా కూర్చున్న కుచ్చుపాప ఉగ్రనరసింహుడు, కుచ్చుపాప వినోద్‌కుమార్‌లను ఉదయం 7.40 గంటల ప్రాంతంలో కొందరు పోలింగ్ కేంద్రం నుంచి బయటకు లాగి, కొట్టి, కులం పేరుతో తిట్టి హత్యాయత్నం చేశారు. ఈ మేరకు వినోద్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో చాపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి చాపాడు మండలం చిన్నగులువలూరుకు చెందిన పాలగిరి లక్ష్మీనారాయణరెడ్డి, పాలగిరి వెంకట సుబ్బారెడ్డి, పాలగిరి గోవర్ధనరెడ్డి, గంజికుంట హర్షవర్ధన్‌రెడ్డి, కొండయ్యగారి శంకర్‌రెడ్డి, కారుముళ్ల భాస్కర్‌రెడ్డి, పాలగిరి చంద్రమోహన్‌రెడ్డి, యర్రన్నగారి చంద్ర ఉరఫ్ చంగా చంద్ర ఓబుళరెడ్డిలను బుధవారం అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. వీరిని మైదుకూరులోని కోర్టుకు హాజరుపెట్టగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో జైలుకు తరలించామన్నారు.

మరో వివాహం చేసుకోవాలనే కొడుకు హత్య..

వేంపల్లె, మే 15: మరో అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనే దురుద్దేశంతో భార్య సంధ్యను వేధించడంతో పాటు ఒకటిన్నర సంవత్సరం వయసు ఉన్న కొడుకు శ్రీనివాస్‌ను తండ్రి హత్య చేశాడని సీఐ చాంద్‌బాష తెలిపారు. ఈనెల 11న సురేష్ అనే వ్యక్తి తన కొడుకు శ్రీనివాస్‌ను గొంతునులిమి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని ఆయన తెలిపారు. పిల్లాడికి ఏడాది వయసు ఉన్నప్పుడు కూడా చంపేందుకు ప్రయత్నించాడని, ఆసుపత్రిలో చికిత్స పొందారని తెలిపారు. మనసులో దురుద్దేశంతో పెట్టుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని తెలిపారు.

ఏఎస్ఐ అన్వర్ మృతి



గోపవరం, మే 15: ఐదేళ్లుగా బద్వేలు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఆర్.అన్వర్ అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు స్వగృహంలో మరణించారు. బద్వేలు రూరల్ సీఐ విక్రమసింగ్, ఎస్ఐ రవికుమార్, జిల్లా పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు దూలం సురేష్, కార్యదర్శి ఉప్పుశంకర్, సిబ్బంది మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కడప నుంచి వచ్చిన రిజర్వు పోలీసులు గౌరవ వందనం, ఇతర పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

టూరిజం అండ్ ట్రావెల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (మారుతీనగర్) మే 15. కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ సార థ్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి నెల్లూరులో గల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్మెంట్ (ఐటీటీఎం)లో టూరిజం అండ్ ట్రావెల్ కోర్సుల కొరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐఐటీటీఎం సహాయ ఆచార్యులు పి.శరవణన్ కోరారు. బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసక్తిగల ఏదేని డిగ్రీ పాసైన విద్యార్థులు 2 సంవత్సరాల కోర్సు అయిన ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్) కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్ పాసైన వారు 3 సంవత్సరాల బీబీఏ (టూరిజం అండ్ ట్రావెల్) కోర్సుకు దరఖాస్తు చేసుకోవా లన్నారు. ఇతర వివరాలకు 9966462786 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పగలు కోతులు... రాత్రిళ్లు పందుల బెడద

● పంటలను కాపాడుకోలేక ఆందోళనలో రైతులు

చక్రాయపేట, మే 14: పగలు కోతులు.. రాత్రి వేళ పందుల బెడదతో పంటలను కాపాడుకోవాలంటే తలప్రాణం తోకకు వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్లు, బావులు ఎండి పోవడంతో అక్కడక్కడ కొర్ర, రాగి, మామిడి, టమోట, మిరప, వంగ పంటలను సాగు చేశారు. ఈ పంటలు సాగుచేసినప్పటి నుంచి రోగాల బారి నుంచి కాపాడు కోవడానికే రైతులు నానా తంటాలు పడ్డారు. మరోవైపు రాత్రిళ్ల వేళ పందులు ఏరువాక సమయంలో ట్రాక్టర్లతో దుక్కులు చేసినట్లు దున్నేస్తున్నాయి. రాత్రివేళ డప్పులు కొట్టి, శబ్దాలు చేసి పందులను రాకుండా చేసుకుంటే, పగటి వేళలో కోతలు చెట్లపైకి వచ్చి మామిడి, వంకాయలను కొరికి పారేస్తున్నాయి. కోతులను అరికట్టడానికి పులులు, సింహాలు లాంటి బొమ్మలు పెట్టి బెదిరిస్తున్న బెదరడం లేదు. తోటల్లో విద్యుత్ టవర్లు ఎక్కుతు న్నాయి. ఇలా రైతులు వీటి బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసిన సాధ్యం కావడం లేదు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే వర్షాలు లేక ఒకవైపు, మరో వైపు పందులు, కోతుల బారి నుంచి కాపాడుకోలేక పోతున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి జంతువుల బారి నుంచి పంటలను కాపాడేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.


చక్రాయపేటలో మామిడి కాయలను కోతులు పెరికి కింద పడేసిన దృశ్యం



పంటలను కాపాడాలి

నాకు 200 మామిడిచెట్లు ఉన్నాయి. పగలు కోతులు పెరికేస్తున్నాయి. రాత్రిళ్ల పందులు తినేస్తున్నాయి. కొర్రపంటను దున్నేస్తున్నాయి. వీటి బారి నుంచి పంటలను కాపాడేందుకు అధికారులు సలహాలు ఇవ్వాలి.

-చంద్ర, రైతు,
హరిజనవాడ, చక్రాయ పేట.


పత్తి పంటలో పందులు తొక్కేసిన దృశ్యం

50 క్వింటాళ్ల జీలుగలు మంజూరు

కమలాపురం రూరల్, మే 15: మండలానికి 50 క్వింటాళ్ల జీలుగలు, 4 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరైనట్లు ఏవో సరస్వతి తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు మొబైల్ ఫోను తీసుకెళ్లి బయో మెట్రిక్ ద్వారా రైతు భరోసా కేంద్రాల్లో జీలుగలు పొందవచ్చని తెలిపారు. జీలుగలు క్వింటాలు రూ.8800 కాగా ప్రభుత్వ రాయితీ పోను రూ.4400 చెల్లించాలన్నారు. ఎకరాకు 10 కేజీల బ్యాగు ఒకటి చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు ఐదు బ్యాగులు ఇస్తామన్నారు. అలాగే పిల్లిపెసర క్వింటాలు రూ.13400 కాగా ప్రభుత్వం రాయితీ పోను రూ.6700లతో ఎకరానికి 8 కేజీల బ్యాగు ఒకటి చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు ఐదు బ్యాగులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

సుఖ్‌దేవ్‌కు ఘన నివాళి

జమ్మలమడుగు, మే 15: స్థానిక ఐటీఐ కళాశాలలో బుధవారం విప్లవ యువకిశోరం సుఖ్‌దేవ్ జయంతి వేడుకలు డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి బ్రిటిష్ వారిచేత భగత్‌సింగ్ సహచరుడు సుఖ్‌దేవ్ ఉరితీయబడ్డారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ సభ్యులు నాగేంద్ర, సూరి, సురేంద్ర, సాంబ, షరీఫ్, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఎర్రగుంట్ల, మే 15: ఎర్రగుంట్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రగుంట్ల ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ డీజల్, కంప్యూటర్ ఆపరేటింగ్ ప్రోగ్రాం అసిస్టెంట్ కోర్సులున్నాయన్నారు. ఐటీఐలో ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు దారులు టెన్త్ మార్కుల జాబితా, టీసీ, ఆధార్, స్టడీ, కుల ధృవీకరణపత్రం, ఫొటో, ఫోన్‌నెంబర్, ఈ మెయిల్ ఐడీలను సమర్పించాలన్నారు. ఇతర విషయాలకు 9704111807, 9912946371 సెల్‌నెంబర్లను సంప్రదించాలన్నారు.

వైసీపీ మూకల దాడిలో గాయపడిన వారికి పరామర్శ


గాయపడిన వారిని పరామర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (మారుతీనగర్), మే 15 : నగరంలోని గౌస్‌నగర్‌లో వైసీపీ మూకల దాడిలో గాయపడిన వారిని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డిలు పరా మర్శించారు. బుధవారం వారు చిన్నచౌకు, పాత కడప, మోడమీదపల్లె, చలమారెడ్డిపల్లెలో రాజగోపాల్, కృష్ణారెడ్డి, రాము, శివప్రసాద్‌రెడ్డి, మోహన్‌క్రిష్ణ తదితరులను పరామర్శించారు. అలాగే గౌస్ నగర్‌లోని వైసీపీ మూకల దాడిలో గాయపడ్డ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప (మారుతీనగర్) మే 15 : తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల గిరి ప్రదక్షణకు ఆర్టీసీ యాజమాన్యం జిల్లాలోని పలు డిపోల నుంచి ఈనెల 22వ తేదీ బుధవారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు కడప డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు రాత్రి 8 గంటలకు బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు, మీదుగా అరుణాచలానికి చేరుకోనుంది. ఇందులో టికెట్ రూ.1,072లు నిర్ణయించారు. బద్వేల్ డిపో నుంచి అల్ట్రా డీలక్స్ బస్సు ఉదయం 7 గంటలకు బయలు దేరి వయా గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా చేరుకోనుంది. ఇందులో టికెట్ ధర రూ.1,566లు, మరో సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 7గంటలకు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా చేరుకోనుంది. టికెట్ ధర 1,475, మైదుకూరు డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు పోరుమామిళ్ల నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా చేరుకోనుంది. ఇందులో టికెట్ రూ.1,414లుగా నిర్ణయించినట్లు తెలిపారు.

మైదుకూరు డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సాయంత్రం 6 గంటలకు బయలుదేరి కడప, రాయచోటి మీదుగా చేరుకో నుంది. టికెట్ రూ.1,188లు. ప్రొద్దుటూరు డిపో నుంచి ఇంద్ర బస్సు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి వయా మైదుకూరు, కడప, మీదుగా చేరుకుంటుంది. టికెట్ ధర రూ.1,569, జమ్మలమడుగు డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు రాత్రి 8 గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా అరుణాచలం వెళుతుంది. ఇందులో టికెట్ ధర రూ. 1,352, పులివెందుల డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు రాత్రి 8 గంటలకు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలానికి చేరుకోనుంది. ఇందులో టికెట్ రూ.1,242లు. కాగా జిల్లా ప్రజలు స్వామివారి సందర్శనకు వీలుగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించి గిరిప్రదర్శన చేసుకోవాలని కోరారు.

పార్టీకి ద్రోహం చేసిన వారిని ఉపేక్షించేదిలేదు

కమలాపురంలో టీడీపీ విజయకేతనం : పుత్తా చైతన్యరెడ్డి

కడప (మారుతీనగర్) మే 15. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా టీడీపీలో ఉంటూనే తనను ఓడించేందుకు ప్రత్యర్థి పార్టీ నాయకులతో కుమ్మక్కై పార్టీకి, తనకు ద్రోహం చేసిన వారిని ఉపేక్షించేది లేదని కమలాపురం టీడీపీ అభ్యర్థి పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక బిల్టప్ సర్కిల్ సమీపంలోని పుత్తా ఎస్టేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 13న జరిగిన ఎన్నికలలో ప్రజలు చాలా మార్పు కోరుకున్నారని.. కమలాపురంలో టీడీపీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల పోరులో తన కోసం చాలా మంది సహకారం అందించారన్నారు. ముఖ్యంగా మహిళలు, యువత, నిరుద్యోగులు, వృద్ధులు తమ ఓటును సద్వినియోగం చేసుకుని టీడీపీకి బాసటగా నిలిచినందుకు సంతోషంగా వుందన్నారు. కాగా, కమలాపురం మండలం కోగటం గ్రామంలో కొందరు టీడీపీ నాయకులే బాహాటంగా వైసీపీకి ఓట్లు వేయాలని కోరడం జరిగిందన్నారు. గత నలభై సంవత్సరాలుగా కోగటం గ్రామంలో ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల వద్దకెళ్లి ఓట్లు వేసిన దాఖలాలే లేవన్నారు. అలాంటి ఊర్లో సైతం టీడీపీ గెలవాలనే లక్ష్యంతో ఏజెంట్లను కూర్చోబెట్టి రిగ్గింగ్ లేకుండా నియంత్రించినట్లు వెల్లడించారు. ఎన్నికలను సజావుగా జరిగేలా సహకారం అందించిన పోలీసులకు, ఎన్నికల అధికారులకు, మీడియా ప్రతినిధులకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి

ఘనంగా దుర్గా ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు



కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేస్తున్న దుర్గాప్రసాద్, దేవునికడపలో కడప నగర తెలుగుయువత ఉపాధ్యక్షుడు దుర్గాకుమార్ (సాయి) ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు

కడప (ఎర్రముక్కపల్లె), మే 15: ప్రముఖ వ్యాపారవేత్త, బలిజసంఘం నాయకులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుధా దుర్గాప్రసాద్ పుట్టినరోజు వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం కడప నగరంలోని 7, 10, 3, 2, 25, 26, 29, 50, 14, 47, 48, 5, 21 డివిజన్లలో దుర్గాప్రసాద్‌ను పూలమాలలు, బొకేతో శాలు వాలతో ఘనంగా సత్కరించారు. ఉక్కుశ్రీకాంత్ ఆధ్వర్యంలో పద్మావతి ఆశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. సాయిపేటకు చెందిన రవి ఆధ్వర్యంలో అమ్మఒడి చిన్నారులకు అన్నదానం చేశారు.

వివిధ డివిజన్లలో దుర్గాప్రసాద్ యువసేన, టీడీపీ, జనసేన నాయకత్వంలో కేక్‌లు కట్ చేసి పుట్టిన వేడుకలు భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులను, నాయకులను అభినందించారు. భవిష్యత్తులో ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. అభిమానులు సేవా కార్యక్రమాలను రాత్రి వరకు కొనసాగించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బలక్ష్మి, మాజీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమీర్‌బాబు, రెండో డివిజన్‌స్థాయి, మూడో డివిజన్ ఉమాబాయి, ఐదో డివిజన్ సునీల్, ఏడవ డివిజన్ తోట సుమన్, తుంగా రమణయ్య, 14వ డివిజన్ మిరియాల ఈశ్వర్, 21వ డివిజన్ ఐఫైవ్ బాబు, 25వ డివిజన్ సిద్ధార్థ, స్వరూప్, 28వ డివిజన్ రాఘవ, శేషురాయల్, 47వ డివిజన్ రాజేంద్ర, 48వ డివిజన్ రూప్‌కుమార్, జనసేన నాయకులు రంజిత్ కుమార్, గజ్జల సాయి, చార్లెస్, రాజగోపాల్, తేజా, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

18న వాసవీమాత జయంతి



ప్రొద్దుటూరు టౌన్, మే 15: వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 18వ తేదీ అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టిరామమోహన్‌రావు తెలిపారు. 18వ తేదీ ఉదయం 6 గంటలకు మహాప్రాకారోత్సవం, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 7 గంటలకు 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వ్యక్తిపై దాడి

మైదుకూరు, మే 15: చాపాడు మండలం విశ్వనాథపురం వాసి భూమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డిపై బుధవారం సాయంత్రం మైదు కూరులో దాడి చేశారు. ఎన్నికల్లో ఏజెంటుగా కూర్చున్నానని ప్రొద్దుటూరు రోడ్డులో వెళ్తుండగా, చాపాడు మండలం విశ్వనాథపురం వాసులు కార్తీక్‌రెడ్డి, బొచ్చు సుబ్బారెడ్డి, ఇల్లూరి సుబ్బారెడ్డి మరో నలుగురు కలసి తనపై బీరు సీసాలతో దాడి చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారని సీఐ మస్తాన్ తెలిపారు.

జ్యోతి క్షేత్రాన్ని సందర్శించిన తులసిరెడ్డి

కాశినాయన .మే15: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి బుధవారం కాశినాయన మండలం జ్యోతి క్షేత్రాన్ని సందర్శించారు. కాశిరెడ్డినాయన పాలరాతి సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రం నిర్వాహకులు తులసిరెడ్డిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన మాటాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దేవాలయ నిర్మాణానికి ఎలాంటి అడ్డం కులు లేకుండా అన్ని అనుమతులు వచ్చేలా చూస్తానన్నారు.

వేసవి దుక్కులు ఎంతో ఉపయోగం


పొలంలో దుక్కులు దున్నుతున్న దృశ్యం

మైలవరం, మే 15: పంట పొలాల్లో వేసవి దుక్కులతో రైతులకు మంచి లాభాలు చేకూ రుతాయని మండల వ్యవసాయాధికారి విజయారావు తెలిపారు. పంటల సాగులో కలుపు సమస్య దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కలుపు యాజమాన్య ప్రక్రియ వేసవి కాలం నుంచి చేపడితే మంచి ఫలితాలు వస్తా యని, మందులను ఆశ్రయించకుండా రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించాలని, నివారణకు చేపట్టాల్సిన పనులు, లోతు దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలపై పలు సూచనలు చేశారు. పంట కోతల అనంత రం మిగిలిపోయిన కలుపును పూర్తిగా నాశనం చేయాలి. శనగ, మిరప, మినుము, పెసర, తదితర పంటలు పూర్తి అయిన తర్వాత మిగిలిన కలుపు మొక్కలు తొలకరి వర్షాలకు అధిక విత్తనోత్పత్తి చేసుకుంటాయి. అందువల్ల వేసవిలో తప్పని సరిగా లోతు దుక్కులు దున్నాలి. ఇలాంటి దుక్కుల వలన భూమిలో ఉన్న కీటకాల గుడ్లు, లార్వాలు చనిపోవడంతో పాటు గడ్డిజాతులైన తుంగ, గరికను అరికట్టవచ్చు. భూమి లోని పోషకాలు కూడా పెరిగి పంటదిగుబడి బాగా వస్తుంది.

● లోతు దుక్కులు నేలను చదును చేసే పనులే కాకుండా వేసవిలో వచ్చే జల్లులు, తొలకరి వర్షాలకు ఉపయోగించుకుని నేల అవసరాన్ని బట్టి పైపొరల్లోని కలుపు విత్తనాలు చాలా వరకు మొలక దశలోనే అంతరించి పోతాయి. ఇతర కలుపు జాతులైన ఊద, చిప్పెర, ఉర్రంగి, నేల ఉసిరి, తదితర మొక్కలుంటే లోతు దుక్కులు దున్నడం వల్ల అటువంటి మొక్కలు నశిస్తాయి. ఆరుతడి పంటగా వరి సాగు చేసినప్పుడు, పత్తి, మిరప, తదితర పంటల సాగుకు ముందే వేసవిలో లోతు దుక్కులు దున్ను కోవాలి. ఎండకు సైతం భూమి పొరల్లోకి చొచ్చుకు వెళ్లి క్రిమి కీటకాలను నాశనం చేస్తుంది. ప్రతి రైతు తమ పొలంలో భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలి. భూసార పరీక్షల వల్ల భూమిలోని పోషక విలువలు తెలుస్తాయి. పోషక విలువలు పెరగడం వల్ల పంటలకు ఎరువులను ఏ మోతాదులో వాడాలో తెలుసుకుని రైతులు ఖర్చులు తగ్గించుకోవచ్చు.

వైభవంగా పెద్దమ్మ, చిన్నమ్మ దేవర ప్రారంభం


విశేష అలంకారంలో పెద్దమ్మ దేవత

ఎర్రగుంట్ల, మే 15: మండలంలోని పోటదుర్తిలో పెద్దమ్మ, చిన్నమ్మ దేవర మహోత్సవానికి మహిళా భక్తులు పోటెత్తారు. కొన్ని దశాబ్ధాల తరువాత చేస్తున్న ఈ దేవర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఊరంతా కలిసి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చేస్తున్న ఈ దేవరకు ప్రత్యేకత సంతరించుకుంది. బుధవారం ఉదయం గ్రామం నలుమూల నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో మట్టికుండల్లో పెరుగన్నంతో కూడిన బోనాల(చల్ల)ను తీసుకుని వేలాది మంది మహిళలు వీదుల్లోనుంచి వాయిద్యాలు, తప్పెట్లు, దరువులతో ఆలయం చేరుకున్నారు. బో నాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పొలిమేరల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవర సందర్భంగా అమ్మ వారికి వైభవంగా అలంకారం నిర్వహించారు. శనివారం ఉదయం 7గంటల నుంచి పోట్లదుర్తి గ్రామ నాలుగు దిక్కుల తోరణాలు ఏర్పాటు చేయడం, మధ్యాహ్నం 12గంటలకు గుడి వద్ద అన్న ప్రసాదం వితరణ, సాయంత్రం నాలుగు గంటలకు చిన్నమ్మ, పెద్దమ్మల ప్రతిమలను తయారు చేయడం, సాయంత్రం 5గంట లకు పెద్దమ్మ గుడి వద్ద దేవర దున్నపో తుకు పూజలు, గ్రామమంతా మెరవణి నిర్వహించనున్నారు. రాత్రి 10గంటలకు పెద్దమ్మ, చిన్నమ్మల కథ చెప్పి అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 19వ తేదీ ఆదివారం తెల్లవారుజామున దున్నపోతు నరికే కార్యక్రమం, గ్రామంలో పొలిచల్లే కార్యక్రమం నిర్వహించను న్నారు. తెల్లవారు జాము 5గంటలకు బోనాలు సమర్పణ, మొక్కుబడులు తీర్చుకోనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 20వ తేదీ తెల్లవారుజాము 4గంటలకు అమ్మవార్లు పోలిమేరకు పోయే కార్యక్రమం, అనంతరం భక్తులకు దీన బండారం పంపిణీ ఉంటుందని తెలిపారు.



అక్రమంగా మట్టిరవాణా

● చిన్నపసుపుల బంజరు భూముల నుంచి తరలుతున్న వైనం ● వైసీపీ నేతలకు కాసుల వర్షం ● పట్టించుకోని అధికారులు



చిన్నపసుపుల - ఎస్.ఉప్పలపాడు నడుమ దర్శనమిస్తున్న గుంతలు - మట్టి కోసం వెళ్లే టిప్పర్లకు దారి


చిన్నపసుపుల సచివాలయం మీదుగా మట్టిలోడుతో తరలిపోతున్న టిప్పర్లు

జమ్మలమడుగు, మే 15: జమ్మలమడుగు నియోజకవర్గంపెద్దముడియం మండలం చిన్నపసుపుల శివార్లలో 20 రోజుల నుంచి భారీగా రాత్రి, పగలు టిప్పర్లలో మట్టి తరలిస్తున్నారు. గ్రామ శివార్లలోని ఎస్.ఉప్పలపాడుకు వెళ్లే దారి ప్రధాన రోడ్డు ఆ ప్రాంతం నుంచి మట్టి తరలించే యజమానికి అనుకూలంగా మారింది. రోజుకు మట్టి భారీగా బయటికి తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు, భారీగా కాసులు కురిపిస్తోందని పలువురు తెలిపారు. అయితే నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ఆ ప్రాంతాన్ని అధికారులు ఎవరూ చూడకపోవడం, వెళ్లకపోవడం, ఆ నేతకు కలిసి వచ్చినట్లుగా తెలుస్తోంది. రూ.2 నుంచి రూ.3 వేల వరకు ఒక్కో టిప్పర్‌కు ఆదాయం వస్తోందని తెలుస్తోంది. దీంతో గ్రామంలోని రోడ్లు గుల్ల వుతున్నాయని వాపోతున్నారు. దాదాపు రూ.20 లక్షలకు పైగా ఇప్పటికే ఆదాయం వచ్చి ఉంటుందని పలువురు అంచనా వేశారు. సంబందిత అధికారులు పరిశీలించి వెంటనే అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. మరికొందరు ట్రాక్టర్లలో మట్టి తరలిస్తున్నారు. ఏదేమైనా చిన్నపసుపుల గ్రామం ఎస్.ఉప్పలపాడు గ్రామాల మధ్య అక్రమ రవాణా జోరుగా సాగుతుండడం వలన రోడ్లు గుంతలు పడి పూర్తిగా దెబ్బతిన్నాయి. గతంలో సైతం ఆ దారిలో ఇసుక కూడా అక్రమ రవాణా జోరుగా సాగిందని తెలుస్తోంది. ఈ విషయమై పెద్దముడియం తహసీల్దారు రవికుమార్ వివరణ ఇస్తూ వివరణ కోరగా సిబ్బందిని పంపి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమంగా మట్టి రవాణా

● చిన్నపసుపుల బంజరు భూముల నుంచి తరలుతున్న వైనం

వైసీపీ నేతలకు కాసుల వర్షం ● పట్టించుకోని అధికారులు



చిన్నపసుపుల - ఎస్.ఉప్పలపాడు నడుమ దర్శనమిస్తున్న గుంతలు - మట్టి కోసం వెళ్లే టిప్పర్లకు దారి

జమ్మలమడుగు, మే 15: జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలం చిన్నపసుపుల శివార్లలో 20 రోజుల నుంచి భారీగా రాత్రి, పగలు టిప్పర్లలో మట్టి తరలిస్తున్నారు. గ్రామ శివార్లలోని ఎస్.ఉప్పలపాడుకు వెళ్లే దారి ప్రధాన రోడ్డు ఆ ప్రాంతం నుంచి మట్టి తరలించే యజమానికి అనుకూలంగా మారింది. రోజుకు మట్టి భారీగా బయటికి తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు, భారీగా కాసులు కురిపిస్తోందని పలువురు తెలిపారు. అయితే నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ఆ ప్రాంతాన్ని అధికారులు ఎవరూ చూడకపోవడం, వెళ్లకపోవడం, ఆ నేతకు కలిసి వచ్చినట్లుగా తెలుస్తోంది. రూ.2 నుంచి రూ.3 వేల వరకు ఒక్కో టిప్పర్‌కు ఆదాయం వస్తోందని తెలుస్తోంది. దీంతో గ్రామంలోని రోడ్లు గుల్ల వుతున్నాయని వాపోతున్నారు. దాదాపు రూ.20 లక్షలకు పైగా ఇప్పటికే ఆదాయం వచ్చి ఉంటుందని పలువురు అంచనా వేశారు. సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. మరికొందరు ట్రాక్టర్లలో మట్టి తరలిస్తున్నారు. ఏదేమైనా చిన్నపసుపుల గ్రామం ఎస్.ఉప్పలపాడు గ్రామాల మధ్య అక్రమ రవాణా జోరుగా సాగుతుండడం వలన రోడ్లు గుంతలు పడి పూర్తిగా దెబ్బతిన్నాయి. గతంలో సైతం ఆ దారిలో ఇసుక కూడా అక్రమ రవాణా జోరుగా సాగిందని తెలుస్తోంది. ఈ విషయమై పెద్దముడియం తహసీల్దారు రవికుమార్ వివరణ ఇస్తూ వెంటనే సిబ్బందిని పంపి విచారణ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.



చిన్నపసుపుల సచివాలయం మీదుగా మట్టిలోడుతో తరలిపోతున్న టిప్పర్లు

వేసవి దుక్కులు ఎంతో మేలు



పొలంలో దుక్కులు దున్నుతున్న దృశ్యం

మైలవరం, మే 15: పంట పొలాల్లో వేసవి దుక్కులతో రైతులకు మంచి లాభాలు చేకూరుతాయని మండల వ్యవసాయాధికారి విజయారావు తెలిపారు. పంటల సాగులో కలుపు సమస్య దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కలుపు యాజమాన్య ప్రక్రియ వేసవి కాలం నుంచి చేపడితే మంచి ఫలితాలు వస్తాయని, మందులను ఆశ్రయించకుండా రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించాలని, నివారణకు చేపట్టాల్సిన పనులు, లోతు దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలపై పలు సూచనలు చేశారు. పంట కోతల అనంతరం మిగిలిపోయిన కలుపును పూర్తిగా నాశనం చేయాలి. శనగ, మిరప, మినుము, పెసర, తదితర పంటలు పూర్తి అయిన తర్వాత మిగిలిన కలుపు మొక్కలు తొలకరి వర్షాలకు అధిక విత్తనోత్పత్తి చేసుకుంటాయి. అందువల్ల వేసవిలో తప్పని సరిగా లోతు దుక్కులు దున్నాలి. ఇలాంటి దుక్కుల వలన భూమిలో ఉన్న కీటకాల గుడ్లు, లార్వాలు చనిపోవడంతో పాటు గడ్డిజాతులైన తుంగ, గరికను అరికట్టవచ్చు. భూమిలోని పోషకాలు కూడా పెరిగి పంటదిగుబడి బాగా వస్తుంది.

● లోతు దుక్కులు నేలను చదును చేసే పనులే కాకుండా వేసవిలో వచ్చే జల్లులు, తొలకరి వర్షాలకు ఉపయోగించుకుని నేల అవసరాన్ని బట్టి పైపొరల్లోని కలుపు విత్తనాలు చాలా వరకు మొలక దశలోనే అంతరించి పోతాయి. ఇతర కలుపు జాతులైన ఊద, చిప్పెర, ఉర్రంగి, నేల ఉసిరి, తదితర మొక్కలుంటే లోతు దుక్కులు దున్నడం వల్ల అటువంటి మొక్కలు నశిస్తాయి. ఆరు తడి పంటగా వరి సాగు చేసినప్పుడు, పత్తి, మిరప, తదితర పంటల సాగుకు ముందే వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలి. ఎండకు సైతం భూమి పొరల్లోకి చొచ్చుకు వెళ్లి క్రిమి కీటకాలను నాశనం చేస్తుంది. ప్రతి రైతు తమ పొలంలో భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలి. భూసార పరీక్షల వల్ల భూమిలోని పోషక విలువలు తెలుస్తాయి. పోషక విలువలు పెరగడం వల్ల పంటలకు ఎరువులను ఏ మోతాదులో వాడాలో తెలుసుకుని రైతులు ఖర్చులు తగ్గించుకోవచ్చు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఎర్రగుంట్ల, మే 15: 2024-2025 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఎర్రగుంట్లలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ ఆనంద్ తెలిపారు. ఎర్రగుంట్ల ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ డీజల్, కంప్యూటర్ ఆపరేటింగ్ ప్రోగ్రాం అసిస్టెంట్ కోర్సులున్నాయన్నారు. ఐటీఐలో ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు దారులు టెన్త్ మార్కుల జాబితా, టీసీ, ఆధార్, స్టడీ, కుల ధృవీకరణపత్రం, ఫొటో, ఫోన్‌నెంబర్, ఈ మెయిల్ ఐడీలను సమర్పించాలన్నారు. విషయాలకు 9704111807, 9912946371 నెంబర్లను సంప్రదించాలన్నారు.

18న వాసవీమాత జయంతి



ప్రొద్దుటూరు టౌన్, మే 15: వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 18వ తేదీ అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టిరామ మోహన్‌రావు తెలిపారు. 18వ తేదీ ఉదయం 6 గంటలకు మహాప్రాకారోత్సవం, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 7 గంటలకు 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వ్యక్తిపై దాడి

మైదుకూరు, మే 15: చాపాడు మండలం విశ్వనాథపురం వాసి భూమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డిపై బుధవారం సాయంత్రం మైదుకూరులో దాడి చేశారు. ఎన్నికల్లో ఏజెంటుగా కూర్చున్నానని ప్రొద్దుటూరు రోడ్డులో వెళ్తుండగా, చాపాడు మండలం విశ్వనాథపురం వాసులు కార్తీక్‌రెడ్డి, బొచ్చు సుబ్బారెడ్డి, ఇల్లూరి సుబ్బారెడ్డి మరో నలుగురు కలసి తనపై బీరు సీసాలతో దాడి చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారని సీఐ మస్తాన్ తెలిపారు.

మౌలిక వసతులు కరువు

● అధ్వాన్నంగా పారిశుధ్యం

● అస్తవ్యస్తంగా మంచినీటి సరఫరా

● ఇదీ కొత్తపల్లె దుస్థితి

ప్రొద్దుటూరు టౌన్, మే 15: కొత్తపల్లె పంచాయతీ జిల్లాలో పేరుపొందిన మేజర్ పంచాయతీ. ఎంతో ఆదాయం కలిగిన పంచాయతీలో సైతం మౌలిక వసతులు కొరవడ్డాయి. ఇందుకు ప్రధాన కారణం రాజకీయ నేతలేనని చెప్పక తప్పదు. రోడ్లు, కాల్వలు, మంచినీటి సరఫరా, పారిశుధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీలో వాణిజ్య సముదాయాలు, ఆటోమొబైల్ షోరూంలు ఎక్కువగా ఉండడంతో ఆదాయం పుష్కలంగా ఉంది. పన్నుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. పంచాయతీలో ఎక్కువ భాగం రోడ్లు, కాల్వలు లేవు. నివాసాలు లేనిచోట ప్రైవేటు వెంచర్లు, అనుమతి లేని లేఅవుట్లలో ప్రభుత్వ నిధులతో కాల్వలు, రోడ్లు నిర్మించారన్న ఆరోపణలున్నాయి. పంచాయతీలో మంచినీటి సమస్య అధికంగా ఉంది. తాగునీటి సరఫరా కోసం, మోటార్ల మరమ్మతులు, ఇతర అవసరాలకోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా సక్రమంగా నీటిని సరఫరా చేయలేకపోతున్నారు.



కాల్వలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



పూడికతో నిండిన మురికి కాల్వ - కాల్వలో మురికినీరు తాగుతున్న పశువులు

అమలుకు నోచుకోని కలెక్టర్ ఆదేశాలు

వేసవిలో మంచినీటి సమస్యను అధిగమించడానికి పంచాయతీ నిధులు, ప్రత్యేక నిధులు ఖర్చు చేయాలన్న కలెక్టర్ ఆదేశాలు కొత్తపల్లె పంచాయతీలో అమలుకు నోచుకోవడంలేదు. తాగునీటి సమస్య ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా కొత్తబోర్లు ఏర్పాటు చేయడం, వ్యవసాయ బోర్లు అద్దెకు తీసుకోవాలన్న ఆదేశాలున్నా నిధులు ఖర్చు చేయడంలేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

● పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ ఏదీ ?

పారిశుధ్యం మెరుగుపరచడానికి ఏడాదికి రెండుసార్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాల్సి ఉంది. పారిశుధ్యంను మెరుగుపరచినట్లు పంచాయతీ అధికారులు రికార్డులో నమోదు చేసుకుంటున్నారే తప్ప ఎక్కడా పారిశుధ్యంపై దృష్టి పెట్టడంలేదు. దీంతో మురికి కాల్వలు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి అధ్వానంగా మారాయి. పట్టణంలోని మురికినీరు అంతా పంచాయతీలో ప్రవహిస్తుండడంతో కొన్ని ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. మురికినీటిని శుద్ధి చేసి వదలాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

● కానపల్లెలో పశుసంపద ఎక్కువ

కానపల్లెలో పశుసంపద ఎక్కువే. అయితే నీటి సమస్య కూడా మరింత ఎక్కువే. దీంతో తో పశువులు మదూరు కాల్వలోని మురికినీరు తాగే దుస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. మురికినీరు నిల్వ ఉండి వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. పంచాయతీలో మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుధ్యం అధ్వానం : లక్షుమయ్య



ఆర్టీసీ బస్టాండు, ఇండస్ట్రియల్ ఏరియా, మత్స్య కాలనీలో సరైన మురికి కాల్వలు లేవు. వేసవిలో తప్ప ఇతర సమయంలో మురికినీరు పొంగి ప్రవహిస్తుంటోంది. పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలి.

మంచినీరు సరఫరా చేయాలి : పాండు



పంచాయతీకి ఆదాయం ఉన్నా మంచినీటి వనరులున్నా సక్రమంగా నీటిని సరఫరా చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు నీరు రావడంలేదని ఫిర్యాదు చేసినా సరిగా స్పందించడంలేదు.

జ్యోతి క్షేత్రాన్ని సందర్శించిన తులసిరెడ్డి



జ్యోతిలో కాశినాయన సమాధిని దర్శించుకున్న తులసిరెడ్డి

కాశినాయన .మే15: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి బుధవారం కాశినాయన మండలం జ్యోతిక్షేత్రాన్ని సందర్శించారు. కాశిరెడ్డి నాయన పాలరాతి సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రం నిర్వాహకులు తులసిరెడ్డిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దేవాలయ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా అన్నిఅనుమతులు వచ్చేలా చూస్తానన్నారు.

సుఖ్‌దేవ్‌కు ఘనంగా నివాళి

జమ్మలమడుగు, మే 15: స్థానిక ఐటీఐ కళాశాలలో బుధవారం విప్లవ యువకిశోరం సుఖ్‌దేవ్ జయంతి వేడుకలు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి బ్రిటిష్ వారిచేత భగత్‌సింగ్ సహచరుడు సుఖ్‌దేవ్ ఉరితీయబడ్డారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు నాగేంద్ర, సూరి, సురేంద్ర, సాంబ, షరీఫ్, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ, చిన్నమ్మ దేవర ప్రారంభం

బోనాలతో పోటెత్తిన మహిళలు ● భక్తి శ్రద్ధలతో పూజలు



విద్యుత్ దీపకాంతులతో అమ్మవారి ఆలయం - (ఇన్‌సెట్‌లో) విశేష అలంకారంలో పెద్దమ్మ దేవత

ఎర్రగుంట్ల, మే 15: ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో పెద్దమ్మ, చిన్నమ్మ దేవర మహోత్సవానికి మహిళా భక్తులు పోటెత్తారు. కొన్ని దశాబ్దాల తరువాత చేస్తున్న ఈ దేవర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఊరంతా కలిసి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చేస్తున్న ఈ దేవరకు ప్రత్యేకత సంతరించుకుంది. బుధవారం ఉదయం గ్రామం నలుమూల నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో మట్టికుండల్లో పెరుగన్నంతో కూడిన బోనాల(చల్ల)ను తీసుకుని వేలాది మంది మహిళలు వీధుల్లోనుంచి వాయిద్యాలు, తప్పెట్లు, దరువులతో ఆలయం చేరుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పొలిమేరల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవర సందర్భంగా అమ్మవారికి వైభవంగా అలంకారం నిర్వహించారు. శనివారం ఉదయం 7గంటల నుంచి పోట్లదుర్తి గ్రామ నాలుగు దిక్కుల తోరణాలు ఏర్పాటు చేయడం, మధ్యాహ్నం 12గంటలకు గుడి వద్ద అన్నప్రసాదం వితరణ, సాయంత్రం నాలుగు గంటలకు చిన్నమ్మ, పెద్దమ్మల ప్రతిమలను తయారు చేయడం, సాయంత్రం 5గంటలకు పెద్దమ్మ గుడి వద్ద దేవర దున్నపోతుకు పూజలు, గ్రామమంతా మెరవణి నిర్వహించనున్నారు. రాత్రి 10గంటలకు పెద్దమ్మ, చిన్నమ్మల కథ చెప్పి అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 19తేదీ ఆదివారం తెల్లవారుజామున దున్నపోతు నరికే కార్యక్రమం, గ్రామంలో పొలిచల్లే కార్యక్రమం నిర్వహించనున్నారు. తెల్లవారుజాము 5గంటలకు బోనాలు సమర్పణ, మొక్కుబడులు తీర్చుకోనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 20వ తేదీ సోమవారం తెల్లవారుజాము 4గంటలకు అమ్మవార్లు పొలిమేరకు పోయే కార్యక్రమం, అనంతరం భక్తులకు దీన బండారం పంపిణీ ఉంటుందన్నారు. గ్రామ ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని దేవరను విజయవంతం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామపెద్దలు పిలుపునిచ్చారు.

వేడుకగా అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, మే 15: అగస్త్యేశ్వరస్వామి వాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. స్వామివారికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, శాంతి హోమాలు నిర్వహించి పండితులు పూర్ణాహుతి సమర్పించారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని సుందరంగా అలంకరించి ఆలయ కాలక్షేప మండపంలో ఆశీనులను చేశారు. పండితులు సుముహూర్తంలో వేద మంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కల్యాణం తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, ఏసీ, భక్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అనారోగ్యం

పారిశుధ్య పనుల పర్యవేక్షణ నిల్ ● పేరుకుపోతున్న చెత్త, చెదారం ● పట్టించుకోని అధికారులు

ప్రొద్దుటూరు , మే 15: ప్రజా ఆరోగ్య శాఖ అనారోగానికి గురైంది. పట్టణంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. రోడ్లపైనే చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయి. సకాలంలో చెత్తను వార్డుల్లో పాయింట్ల నుంచి తరలించలేక పోవడం వల్ల దుర్భరంగా మారుతోంది. దీనికి తోడు వార్డుల్లో పారిశుధ్య పనుల పర్యవేక్షణ లేకపోవడంతో వర్కర్లు ఇష్టా రాజ్యంగా సాగుతున్నారు. ఇందుకు కారణం కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వర్కర్ల దగ్గర మస్టర్లకు మాముళ్లు గుంజుతున్నట్లు బహిరంగ ఆరోపణలు వినబడుతున్నాయి. కాల్వలు అధ్వాన్నంగా తీయిస్తున్నారు. కాల్వల్లోవుండే సిల్ట్ తీయకుండా పైపైన కాగితాలు చెత్తాచెదారం తీస్తున్నారు. కొన్ని వార్డుల్లో ముఖ్యంగా జగంపేట సచివాలయ పరిధిలో వర్కర్లు లేరు. కేవలం ఇద్దరు వర్కర్లకు పెద్ద ఏరియాను ఇచ్చి శుభ్రం చేయమని శానిటరీ అధికారులు చెబుతున్నారు. దీంతో ఆ వర్కర్లు సరిగా పని చేయక కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి.



కాల్వలో నిండిపోయిన వ్యర్థాలు



శ్రీనగర్ కాలనీలో నిండిపోయివున్న కాల్వలు

కాల్వలు నిండి మురుగు పారడంలేదు. గతంలో స్థానికులు అధికారులకు ఇక్కడ వర్కర్లు పెంచమని శానిటేషన్ అధ్వానంగా వుంటుందని ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి స్పందన లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కమిషనర్ వార్డుల్లో పర్యటించి పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.